
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 17 జూలై 2024 | 5







'చెట్టంత' కష్టం!

గోష్పాదక్షేత్రంలో 120 ఏళ్ల రావిచెట్టు కొట్టివేత

ఆ రావి చెట్టు అంటే ఎంతో మందికి సెంటిమెంట్.. ప్రతి రోజూ పదుల సంఖ్యలో జనం వచ్చి ఆ చెట్టు కింద సేదతీరే వారు.. పండుగలు..ప్రత్యేక పర్వదినాల్లో అయితే ఆ సంఖ్య వేలల్లో ఉంటుంది.. ఇప్పటి వరకూ ఆ చెట్టు కింద కోట్లాది మంది సేద తీరి ఉంటారు.. ఇక బోలెడు సినిమా షూటింగ్‌లు జరిగాయి. ఎందుకంటే ఆ చెట్టు వయసు 120 సంవత్సరాలు. ఆ చెట్టుకు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో.. అఖండ గోదావరి ఒడ్డున ఉండడం.. అంతటి ప్రాముఖ్యత ఉన్న చెట్టును మంగళవారం అడ్డంగా నరికేశారు.. కొమ్మలను ఇష్టం వచ్చినట్టు కొట్టేశారు.. పచ్చని ఆకులతో.. చుట్టూ కొమ్మలతో కనువిందు చేసే ఆ చెట్టు ప్రస్తుతం బోసిపోయింది. ఈ చెట్టు ఎవరికైనా అడ్డుగా ఉందా అంటే అదీ కాదు.. ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఒక కొమ్మ విరిగిపడింది.. మునిసిపల్ సిబ్బంది ఏం చెప్పారో ఏమో కానీ.. ఆ కొమ్మను తీయడానికి వచ్చిన పనివారు.. చెట్టంతా కొట్టేశారు.. సుమారు 70 శాతం నరికివేసి మొదుగా మిగిల్చారు ఆ చెట్టు కింద పలు రకాల విగ్రహాలు ఉన్నా పట్టించుకో లేదు.. కనీసం ఆ చెట్టుపై కరెంట్ తీగలు లేవు. ఎవరికీ అడ్డుగా కూడా లేదు..సాయంత్రం అయ్యే సరికి వాకింగ్ నిమిత్తం వచ్చిన పర్యావరణ ప్రేమికులు చెట్టంతా కొట్టేస్తుండడం చూసి ఆశ్చర్యపోయారు.. చెట్టు ఎవరు కొట్టమన్నారని మండిపడ్డారు.. చెట్టు కొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చెట్టు నరికుతున్న కార్మికులను ప్రశ్నించగా విరిగిపడిన చెట్టు కొమ్మ తీసుకువెళితే మాకు గిట్టుబాటు కాదని మునిసిపల్ అధికారుల అనుమతి మేరకు ట్రాన్స్‌పోర్టుకు సరిపడా కొమ్మలు నరకడం జరిగిందని చెబుతున్నారు. 2003 గోదావరి పుష్కరాల సమయంలోనూ వందేళ్ల వయసున్న ఈ చెట్టును అప్పటి అధికారులు తొలగించకుండా ఉంచారు. దేవతా వృక్షాన్ని నరికివేసిన రెవెన్యూ అధికారుల వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. - కొవ్వూరు

ఇందుకేనా కొట్టేసింది.!

రావిచెట్టు పుల్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.. అన్ని పుల్లలు దొరికినట్టు దొరకదు. ఎందుకంటే ఎక్కడా రావిచెట్టును కొట్టరు. దీంతో కలప దొరకడంకూడా కష్టమే. రావిచెట్టు పుల్లను ఎక్కువగా హోమాల్లో ఉపయోగిస్తారు. ట్రాక్టర్ పుల్ల ఉందంటే సుమారు రూ.లక్ష ఉంటుందని సమాచారం. డిమాండ్‌ను బట్టి ఇది మరింత పెరగవచ్చని తెలిసింది. దీంతో చెట్టంతా కొట్టేసినట్టు చెబుతున్నారు.

చెట్టు నరికించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో దేవతా వృక్షాన్ని నరికి వేసిన అధికారులపై వాల్టాచట్టం కింద కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలి. విరిగిన కొమ్మను తొలగించాల్సిన అధికారులు చెట్టును నరికించివేయడం తగదు.. వాల్టా చట్టాన్ని దుర్వినియోగ పర్చినందుకు సంబంధిత వ్యక్తులను శిక్షించాలి.

- పిల్లలమర్రి మురళీకృష్ణ, బీజేపీ కౌన్సిలర్

రేపు రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు తెలిపారు. హైకోర్టు ఆదేశాల దృష్ట్యా హెల్మెట్, సీటు బెల్టు ధరించడంతో పాటు రహదారి భద్రత నిబంధనల పాటింపుపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నుంచి కంబాల చెరువు వరకూ గురువారం ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.ర్యాలీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొంటారని పేర్కొన్నారు.



ఆసుపత్రిలో సేవలపై వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



ఆసుపత్రి ఆవరణలో బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్

రోగులకు వీల్‌చైర్లు.. స్ట్రెచర్లు అందుబాటులో ఉంచడంలేదు..

- కలెక్టర్ ప్రశాంతికి పలువురు రోగుల ఫిర్యాదు
- జీజీహెచ్‌లో తనిఖీ..ఆర్ఎంవో నెంబర్ ప్రదర్శించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 : రోగులకు వైద్యసేవలు అందజేసే విషయంలో జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించడానికి ఆర్ఎంవో ఫోన్ నెంబరును ఆసుపత్రి ఆవరణలో ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఓపీలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. క్యాజువాలిటీ వార్డును పరిశీలించారు. క్యాజువాలిటీ వద్ద రోగులకు వీల్‌ఛైర్లు, స్ట్రెచర్లు వంటివి అందుబాటులో ఉంచడంలేదని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల్లో ఎక్కువ మంది సాధారణ, పేద ప్రజానీకం ఉంటారని మెరుగైన వైద్యసేవలు అందజేయాలన్నారు. ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు వేచి ఉండడానికి మూడు వరుసల్లో స్టీల్ కుర్చీలకు చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు అందుబాటులో వీల్‌ఛైర్లు, స్ట్రెచర్ ఏర్పాటుకు, అదనపు సిబ్బందికి ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి చర్యల్లో భాగంగా త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. రోగుల బంధువులకు అదనపు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.కృష్ణంరాజు, వైద్యులు ఉన్నారు.

హాస్టళ్ల మరమ్మతులు చేయండి..

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 : జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల వసతిగృహాల్లో సీఎస్ఆర్ నిధులతో మరమ్మతులు చేయించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సంక్షేమశాఖల అధికారులతో సంక్షేమ వసతిగృహాల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ వసతిగృహాల నిర్వహణ, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వసతిగృహాల్లో తక్షణమే చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు.జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్,జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణి జ్యోతి, కొవ్వూరు బీసీ సంక్షేమ అధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.



చిడిపిలో కాలినడకన వీధులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అపారిశుధ్యం అన్నారని వచ్చేశారు..

కొవ్వూరు, జూలై 16 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కొవ్వూరు మండలం చిడిపి పంచాయతీలో అపారిశుధ్య సమస్య ఉందని తెలియడంతో కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.గ్రామంలో కాలినడకన తిరిగి పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు గ్రామంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్వహణలో భాగంగా గత శనివారం ఎన్ని ట్యాంకులు శుభ్రం చేయించారని అధికారులను ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సిల్టు తొలగించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో కె.సుశీల,ఈవోపీఆర్డీ శర్మ,సెక్రటరి నరేంద్ర ఉన్నారు.

ఐదేళ్లూ.. దారిద్ర్యం!



గోతిలో పడిపోతోంది : ఇది గొయ్యి కాదండోయ్ ఏడీబీ రోడ్డే.. ఈ రహదారంతా ఇంతేనండోయ్..



దిగిపోతున్నా : పైపుల లోడ్‌తో గోతిలో దిగుతున్న వ్యాన్

గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ జగన్ ఏం చేశారు.. ఎన్నికయ్యారు.. అనుభవించారు.. సంక్షేమ ముసుగు వేసి.. అభివృద్ధి, సమస్యలను పక్కన పడేశారు.. దారిద్ర్యం మిగిల్చారు. జగన్ ఐదేళ్ల పాలనకు ఈ రోడ్డే ఒక ఉదాహరణ. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత వచ్చిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అయితే గత ప్రభుత్వ హయాంలో 25 శాతం పూర్తయిన పనులు ఆపేయాలని.. రివర్స్ టెండరింగ్ పేరు తో ఆదేశాలు జారీ చేశారు. అంతే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆ రోడ్డు గురించి ఆలోచించలేదు.. ఇదీ 30 కిలోమీటర్ల మేర నిత్యం రద్దీగా ఉండే రాజానగరం-కాకినాడ ఏడీబీ రోడ్డు దుస్థితి. ప్రస్తు తం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏడీబీ రోడ్డుకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్ టైర్లు ఏవీ : రోడ్డుపై ఉన్న గోతిలో మునిగిన బస్ టైర్లు

రహదారులు గాలికొదిలేశారు..

- ఏడీబీ రోడ్డుకు జగన్ రివర్స్ దెబ్బ
- రాజానగరం టూ సామర్లకోట
- 30 కి.మీ రోడ్డుకు ముప్పుతిప్పలు
- ఏడేళ్లయినా పూర్తికాని వైనం
- గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభం
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- భారీ గోతులతో ఎన్నో ప్రమాదాలు
- కూటమి రాకతో మళ్లీ కదలిక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజానగరం నుంచి సామర్లకోట వరకూ కాకినాడ వెళ్లే ప్రధాన ఏడీబీ రోడ్డు నరకంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎటు చూసినా భారీ గోతులే. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో మరింత అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఆరంభించి ఏడేళ్లు అవుతున్నా ఇప్పటి వరకూ కేవలం 35 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

2017లో రోడ్డు పనులు ఆరంభం

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (వీసీఐసీడీపీ)లో భాగంగా రాజానగరం నుంచి సామర్లకోట వరకూ ఏడీబీ రోడ్డును నాలుగు లేన్లుగా విస్త రించడానికి సుమారు రూ.393 కోట్ల 43 లక్షల 81 వేల 264 అంచనాతో 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో నంబర్ 328తో అడ్మి నిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది.30 కిలోమీటర్ల మేర అభి వృద్ధి చేయాలని అప్పట్లో నిర్మ యించారు.బీఎస్ఆర్- బీఎస్సీపీఎల్ అనే జాయింట్ వెంచర్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. 2021 ఫిబ్రవరి 12వ తేదీకి దీనిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టారు.ఈ మేరకు భూసేకర ణతో పాటు కొంత మేర పనులు చేపట్టారు.

ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ

ఏడీబీ రోడ్డు రెండు జిల్లాల పరిధిలో ఉంది. పొడవు 30 కిలోమీటర్లు. తూర్పుగోదావరి జిల్లాలో 16.29 కిలోమీటర్లు, కాకినాడ జిల్లా పరిధిలో 13.71 కిలోమీటర్లు పొడవు ఉంది. నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయవలసి ఉంది. దీనికి మొత్తం 57.69 ఎకరాల భూమిని సేకరించాలి. టీడీపీ హయాంలోనే కాకినాడ జిల్లా పరిధిలో 23.58 ఎకరాలను సేకరించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 34.11 ఎకరాలు సేకరించాల్సి ఉండగా కొంత మినహా మిగతాది సేకరించారు. పనులు ఆరంభించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రోడ్డుకు శనిపట్టుకుంది. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్స్ పేరిట కొద్దిరోజులు ఆపేసి.. ఎన్నికలకు సుమారు ఏడాదిన్నర ముందు అదే కాంట్రాక్టర్‌కు పనులు కొనసాగించమని చెప్పింది. కానీ చేసిన పనికి డబ్బులు ఇవ్వలేదు.మొత్తం రూ.44.12 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ ఉన్నాయి. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ మరో రూ.7.7 కోట్లు పనిచేసినా వాటి బిల్లులను సీఎఫ్ఎం ఎస్‌లో అప్‌లోడ్ చేయలేదు.2023 జూలైలో తనకు రావాల్సిన సుమారు రూ. 52 కోట్ల రూపాయల బకాయిని చెల్లిస్తేనే రోడ్డు నిర్మాణ పనులు కొనసాగిస్తానని కాంట్రాక్టర్ తెలియజేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో ఇవాళ ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది.



అసలు రోడ్డేది : రోడ్డు కదా అని ధైర్యంగా వస్తే బురదలో దిగిన బైక్.. ఏడీబీ రోడ్డులో ఇటువంటివి సర్వ సాధారణం

కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

రోడ్డును పూర్తి చేయడానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నట్టు చెబుతున్నారు.నిధులు రాకపోవడంతో ఇప్పటికే కాంట్రాక్టర్ ఎక్విప్‌మెంట్ తరలించుకుపోయాడు. సీఎం చంద్రబాబు పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టర్ ఇప్పుడిప్పుడే తిరిగి ఎక్విప్‌మెంట్‌ను తెచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం.ప్రస్తుతం ఇబ్బందిగా ఉన్న కల్వర్టులను బాగు చేస్తున్నారు.బహుశా ఆగస్టు తర్వాత రోడ్డు నిర్మా ణంలో కదలిక వస్తుందనే ప్రచారం ఉంది. వర్షాలు తగ్గిన తర్వాత పనులు ఊపందుకునే అవకాశం ఉంది.

జాతీయ రహదారిపై గోతులు

రావులపాలెం నుంచి రాజమండ్రి మీదుగా విశాఖ వెళ్లే జాతీయ రహదారిలో కూడా అనేక చోట్ల గుంతలు పడ్డాయి.మరమ్మతులు చేస్తున్నా చాలా చోట్ల ఇబ్బందిగా ఉంది. కొన్ని చోట్ల లెవల్స్ సరిగా లేకపోవడంతో వాన నీరు నిలిచిపోతోంది. చెత్తాచెదారం, మట్టిపేరుకు పోతోంది.గామన్ బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డులో దివాన్‌చెరువు నుంచి గామన్ బ్రిడ్జి వరకూ రోడ్డు తారు జరిగిపోయి, గాడులుగా మారింది.దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



తాత్కాలిక మరమ్మతులు..

రంగంపేట, జూలై 16 : రాజానగరం నుంచి రామేశంపేట వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు అద్వానంగా తయారై ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో గోతులు చెరువులను తలపిస్తున్నాయి.ప్రతి రోజూ ప్రయాణికులు వాహనాలతో గోతులలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి తక్షణమే ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు తిరిగి చేపట్టాలని కోరారు. ఈ మేరకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు.ఎస్టీ రాజాపురం పెట్రోల్‌బంక్ వద్ద కల్వర్టు పూర్తిగా మూసుకుపోవడంతో దానిని పూర్తిగా తొలగించి దాని స్థానంలో తూరలు ఏర్పాటు చేశారు.దీంతో వాహనదారులకు కొంత ఇబ్బంది తొలగింది. మరమ్మతు పనులను ఏడీబీ రోడ్డు డీఈఈ భాస్కరరావు,ఏఈఈ బి.ఆదినారాయణ వర్మ పర్యవేక్షించారు.రాబోయే పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తిస్థాయిలో తిరిగి చేపడతామని కాంట్రాక్టర్ యంత్రాలను సమకూర్చుకుంటున్నారని డీఈఈ భాస్కరరావు తెలిపారు.

ఎస్పీ జగదీశ్‌కి ఘన వీడ్కోలు



ఎస్పీని మోస్తూ జై కొడుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎంతకాలం పని చేశామా అనేది కాదు.. ఎంత మంది అభిమానం సంపాదించామనేదే ముఖ్యం. ఎస్పీ జగదీశ్ పది నెలలే జిల్లాలో ఉన్నా ఆయన సిబ్బందికి ఎంతో దగ్గరయ్యారు. అయితే ఇటీవల ఆయన బదిలీ కావడంతో మంగళవారం అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆయనను పూలతో అలంకరించిన వాహనం ఎక్కించి అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలతో సహా అందరూ తాడుతో లాగుతూ పూలవర్షం కురిపించి జేజేలు కొట్టారు. కిందిస్థాయి సిబ్బంది ఆయనను భుజాలపై ఎత్తుకొని అభిమానాన్ని చాటుకున్నారు. ఎస్పీ జగదీశ్ హోదాతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ తమ కుటుంబ సభ్యుడి మాదిరిగా ఆదరించారని కొందరు భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా పోలీస్ స్టేషన్లలో జూమ్ యాప్‌ని ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల నుంచే ఎస్పీకి సమస్య వివరించే విధానం తీసుకొచ్చార న్నారు. అర్జీలు ఇవ్వడానికి జిల్లా కార్యాల యానికి వచ్చే బాధితులు తిరిగి వెళ్లడానికి వాహనాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎస్పీ జగ దీశ్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ హోంగార్డు స్థాయి నుంచి ఉన్న తాధికారుల వరకూ పూర్తి సహకారం అందించార న్నారు. జిల్లాలో విధులు సంతృప్తినిచ్చాయన్నారు. అంతకుముందు పోలీసు శిక్షణ మైదానంలో అడి షనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. రిజర్వు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ డి.ప్రభాకర్, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇదీ నా టీమ్ : జిల్లాలోని ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ జగదీశ్

కష్టం వస్తే..181కు కాల్ చేయండి

మహిళలకు వన్ స్టాప్ సెంటర్ కన్వీనర్ సౌజన్య సూచన



నల్లజర్ల,జూలై 16 : ప్రభుత్వం నిర్వహించే సఖీ వన్ స్టాప్ సెంటర్ (ఒ ఎస్‌సీ)ను 5 నుంచి 60 ఏళ్ల పైబడిన మహిళలు ఉపయోగించుకోవాలని వన్ స్టాప్ సెంటర్ కన్వీనర్ కె.సౌజన్య, ఏలూరు ఆర్‌జెడీ నోడల్ అధికారిణి స్వరాజ్యలక్ష్మి అన్నారు. నల్లజర్ల సీడీపీవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు,కిశోర బాలికలు,కొత్తగా పెళ్లయిన మహిళలకు సఖీ వన్ స్టాప్ సెంటర్ అందించే సేవలపై అవగాహన కల్పించారు.గ్రామాల్లో మహిళలు టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫిర్యాదు చేసే వారికి వసతి కల్పించి తగిన రక్షణతో పాటు లీగ్ సపోర్టు కల్పిస్తామన్నారు. మహిళలు ఎటువంటి సమస్యతో బాధపడుతున్నా 181కు కాల్ చేస్తే తగిన న్యాయం జరుగుతుందన్నారు.ప్రతి జిల్లాలో వన్ స్టాప్ సెంటర్ ద్వారా సేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు.నిరాధారంగా ఉన్న మహిళలు,అనాథలను శక్తినివాసాల్లో చేర్పిస్తామన్నారు.ఉమెన్ హెల్ లైన్ 181,చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేసి సమస్యపరిష్కరించుకోవాలన్నారు.ఈవో అపరంజిని,సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి,కృష్ణవేణి, పాల్గొన్నారు.

ఆధార్, ఇంటి ప్లాన్ ఉంటేనే.. ఉచిత ఇసుక

7

ఉచిత ఇసుక కేటాయింపులో మార్గదర్శకాలు పాటించాలి

కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో సీసీ కెమెరాలు

జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ఛైర్మన్, కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. జిల్లా లోని 7 ఇసుక పాయింట్లు, 31 డిసిల్టేషన్‌పాయింట్ల వద్ద ప్రస్తుతం 3,77,350.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని తెలిపారు. భవన నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఉచిత ఇసుక కేటాయించాలన్నారు. బల్క్ కేటాయింపుల విషయంలో జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం మేరకే కేటాయించాలన్నారు. ఇతర జిల్లాల విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్, ఆయా జిల్లాల ఇసుక కమిటీ సిఫారసులను అనుసరించే కేటాయింపులు ఉంటాయని చెప్పారు. దీనికి సంబంధించిన విజిలెన్స్ అయా జిల్లాల పరిధిలోనే ఉంటుందన్నారు. జిల్లాలో అవసరాలకు అనుగుణంగా ఇసుక లభ్యత ఉండేలా పర్యవేక్షించాలన్నారు. గోదావరి ఉధృతి, ప్రతికూల పరిస్థితుల వల్ల స్టాక్ పాయింట్ల వద్ద నిల్వల కంటే ముందు డిసిల్టేషన్ పాయింట్ల వద్ద ఉన్న నిల్వలను గుర్తించి కేటాయించాలన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక నిల్వలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత నిర్మాణాలకు ఆధార్, ప్లాన్ పంచాయతీ అధికారి ధ్రువీకరణ పత్రాలు అవసరమని తెలిపారు. సబ్-కలెక్టర్, ఆర్డీవోల వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో 360 డిగ్రీ సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ, ఇతర ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన బల్క్ కేటాయింపులకు ఏడు ప్రతిపాదనలు వచ్చాయని, వాటికి నిబంధనలు అనుసరించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పీ వి.సోమశేఖర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ జి.కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ అభివృద్ధికి పూర్తి సహకారం

తొలిసారిగా రాజమండ్రి అసెట్ కార్యాలయాలను సందర్శించిన ఎంపీ హరీష్‌మాధుర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 : ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్, అమలాపురం రీజియన్ల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఎంపీ అయ్యాక తొలిసారిగా ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్‌ను మంగళవారం సందర్శించారు. ఎంపీకి అసెట్ మేనేజరు శాంతనుదాస్ బృందం ఘనంగా స్వాగతం పలికారు. తొలుత అసెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటుపై ఆవరణలో మొక్కను నాటారు. కాన్ఫరెన్స్ హాలులో రాజమండ్రి అసెట్ కార్యకలాపాలకు సంబంధించి సంక్షిప్త ప్రదర్శనను ఎంపీ తిలకించారు. భూసేకరణ, పైప్‌లైన్ వేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అసెట్ సీనియర్ అధికారులు, కలెక్టివ్ పాల్గొన్నారు.



బైక్‌ను ఢీకొన్న కారు

వృద్ధుడి దుర్మరణం

ఏలేశ్వరం, జూలై 16: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పేరవరం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఓ వ్యక్తి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు (80) ఫైనాన్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై పేరవరం వెళ్లి తిరిగి వెళ్తుండగా జాతీయ రహదారి జంక్షన్‌లో విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు స్పీడుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో సూర్యుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సూర్యుడు అల్లుడు జి.సుబ్బిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఒడిసాకు చెందిన వివాహిత హత్య

భర్తే చంపి ఉంటాడనే అనుమానాలు

సర్పవరం జంక్షన్, జూలై 16: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం శివారు భావనారాయణపురంలో ఒడిసాకు చెందిన వివాహిత హత్యకు గురైంది. భర్తే ఈ హత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత మూడేళ్ల కుమారుడితో ఆమె భర్త పరారవ్వడంతో అతనే హత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వివరాల్లోకెళితే ఒడిసా గంజాం జిల్లా కైరాపుటికి చెందిన రిటంగేల్ గౌడ స్త్రైయిన్ (31), నీలు స్త్రైన్‌లు భార్యాభర్తలు, వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. జీవనోపాధి కోసం మూడు నెలల కిందట ఒడిసా రాష్ట్రం నుంచి కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఉంటున్న బంధువులతో కలిసి భర్త సీలింగ్ ఇతర కూలి పనులకు వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం భార్య గౌడ స్త్రైన్‌కు సోదరి ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తన భర్తను మరదలి ఇంటికెళ్లి చూచి రమ్మని పంపించింది. ఇంట్లో గౌడ స్త్రైన్ బోర్లా కింద పడి ముక్కులో నుంచి రక్తస్రావంతో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించి సోదరికి సమాచారం అందించగా ఆమె వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటనా స్థలానికి కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్‌లు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆధారాలు కోసం పోలీసు జాగిలాలను రప్పించారు. భార్యభర్తల మధ్య వివాదాలు ఏమన్నాయా ఉన్నాయా, భర్త ఎక్కడ ఉన్నాడంటూ స్థానికుల నుంచి పోలీసులు సమాచారం సేకరించారు. మూడేళ్ల కుమారుడితో భర్త పరారైనట్లు బంధువులు పోలీసులకు తెలిపారు. భర్తే హత్య చేసి పరారై ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. గౌడ స్త్రైయిన్ సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.



గౌడ స్త్రైయిన్ మృతదేహం, కుమారుడితో(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



పోలీసుల సంరక్షణలో ఉన్న యువతి

నాలుగు నెలలు తర్వాత క్షేమంగా ఇంటికి..

సామర్లకోట, జూలై 16: సామర్లకోట రైల్వే పోలీసులు రాజోలు రాజేశ్వరి అనే యువతిని ఆమె తల్లిదండ్రులకు మంగళవారం క్షేమంగా అప్పగించారు. సామర్లకోట రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు మెదక్ జిల్లా మూసాయికోపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన రాజోలు బాలరాజు కుమార్తె అయిన రాజేశ్వరి ఇంటి నుంచి ఫిబ్రవరి 2024 నెలలో వెళ్లిపోగా రాజేశ్వరి తల్లి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు అప్పడే ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం అప్పటినుంచీ సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అప్రమత్తం చేయడంతో సామర్లకోట రైల్వే పోలీసులు సామర్లకోట ప్లాట్‌ఫాంపై గాలించడంతో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజేశ్వరిని గుర్తించి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రాజేశ్వరి బంధువులు సామర్లకోట చేరుకోవడంతో సామర్లకోట రైల్వే ఎస్‌ఐ లోవరాజు క్షేమంగా అప్పగించారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి..ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన గంగయ్య

వరరామచంద్రాపురం, జూలై 16: మండలంలోని రాయిగూడెం, వీఆర్‌పురం మధ్యలో పూచిక వాగు దగ్గర మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రాయిగూడెం గ్రామానికి చెందిన నూపా గంగయ్య (40) మరో మహిళ ద్విచక్ర వాహనంపై వీఆర్‌పురం వస్తుండగా, కొటారుగొమ్ము గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వీఆర్‌పురం నుంచి కొటారిగొమ్ము వెళ్తున్న క్రమంలో రాయిగూడెం, వీఆర్‌పురం మధ్యలో పూచిక వాగు దగ్గర రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాయగూడెం గ్రామానికి చెందిన నూపా గంగయ్య అక్కడికక్కడే మృతిచెందగా కొటారిగొమ్ము గ్రామానికి చెందిన ఇద్దరి యువకులు తీవ్రగాయాల పాలయ్యారు. అటుగా వెళ్తున్న వారు జరిగిన ప్రమాద విషయాన్ని 108 వాహనానికి తెలియజేయగా, అంబులెన్సు అక్కడకు చేరుకొని గాయాలైన వారిని, మృతదేహాన్ని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు

రూ.11 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

మామిడికుదురు, జూలై 16: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న బీఆర్ అంబేడ్కర కోనసీమ జిల్లా రాజోలు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన రేకపల్లి నాగరాజును అరెస్టు చేసినట్టు నగరం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజుపై వివిధ పోలీసుస్టేషన్లలో తొమ్మిది దొంగతనం కేసులు ఉన్నాయని, ఇటీవల మగటపల్లి గ్రామంలో ఓ దొంగతనం చేయగా అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం దొంగతనాల వివరాలు బయటపడినట్టు తెలిపారు. నిందితుడు ఉపాధి నిమిత్తం తమిళనాడులో కొబ్బరి ఒలుపు చేస్తుంటాడని, ఇటీవల జరిగిన ఎన్నికల నిమిత్తం స్వగ్రామం వచ్చి ఈ దొంగతనాలకు పాల్పడ్డాడని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.10 లక్షల 20 వేలు విలువైన 160 గ్రాముల బంగారం, రూ.80 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రాజోలు కోర్టుకు రిమాండ్ నిమిత్తం మంగళవారం పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా దర్యాప్తుచేసి నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన నగరం ఎస్‌ఐ సురేష్, హెచ్‌సీ బొక్కా శ్రీనివాస్, పీసీ డి.చిరంజీవి, నగరం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అభినందించి రివార్డుకు సిఫార్సు చేశారు.



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్‌ఐ సురేష్

ఆగస్టు 7 నుంచి భీమేశ్వరుని దర్శనం

ద్రాక్షారామ, జూలై 16: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆగస్టు 7 నుంచి భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి దర్శనం, పూజాధికాలకు భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ ఈవో పి.టి.వి. సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం మూలవిరాట్ సంరక్షణ పనులు పూర్తికాగా అమ్మవారి గర్భాలయంలో కొన్ని అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారు. ఈనెల 20 నాటికి పనులు పూర్తి చేస్తామని కేంద్ర పురావస్తు శాఖాధికారులు ఆలయ ఈవోకు సమాచారం ఇచ్చినట్లు ఈవో పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులతో సమావేశం నిర్వహించామని ఆలయ బ్రహ్మలు సూచన మేరకు శూన్యమాసం అయినందున శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున వచ్చేనెల 5న సంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభించి 6 వరకు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. 7 ఉదయం నుంచి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను భక్తులు దర్శించేందుకు అనుమతి ఇస్తామన్నారు. అంతవరకు నంది మండపంలో బాలాలయంలో స్వామి,అమ్మవారి దర్శనం కొనసాగిస్తామని ఈవో తెలిపారు. స్వామివారి మూలవిరాట్ సంరక్షణ పనులు, ఇతర అభివృద్ధి పనులు నిమిత్తం దర్శనం ఏప్రిల్ 24 నుంచి నిలిపివేసిన సంగతి తెలిసిందే.

వైసీపీ హయాంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అండతో

దళితుల భూమి కబ్జా

తొండంగి మండలం కోదాడలో ఉప్పు చెరువు భూముల్లో పాగా

మాజీ మంత్రి దాడిశెట్టి, ఆయన మామ అండతో కబ్జా చేశారని దళితుల ఆరోపణ

శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల ఆదేశాలతో టీడీపీ బృందం భూ పరిశీలన



భూములను పరిశీలిస్తున్న టీడీపీ బృందం

తొండంగి, జూలై 16: మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన మామ అండదండలతో తాము సాగు చేసుకుంటున్న భూములు కబ్జాకు గురయ్యాయని తొండంగి మండలంలో మూడు గ్రామాల దళితులు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు దృష్టికి తీసుకురావడంతో ఆయన ఆదేశాలతో మంగళవారం టీడీపీ బృందం కబ్జాకు గురైన భూములను పరిశీలించింది. కబ్జా కోరల్లో ఉన్న ఉప్పు చెరువు భూములను టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ తదితరులతో కూడిన బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా అక్కడకు మూడు గ్రామాలకు చెందిన దళితులు వచ్చి టీడీపీ నేతలకు గోడు చెప్పుకున్నారు. ఉప్పు చెరువు భూములు వైసీపీ పాలనలో కబ్జాకు గురయ్యాయని వారి కబంధ హస్తాల నుంచి వాటిని విడిపించి తమకు కేటాయించాలని కోరారు. చెరువు ప్రాంతంలో ఉన్న సుమారు 80 ఎకరాల భూమి నీటి తెప్పగా ఉండేదని దీనిని దశాబ్దాలుగా దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గత వైసీపీ పాలనలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన మామ అండదండలతో కొందరు ఈ భూములను కబ్జా చేశారన్నారు. తప్పుడు రికార్డులు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో తమ పేరున ఆన్‌లైన్ చేయించుకున్నారన్నారు. ఆక్రమించిన భూముల్లో చేపల చెరువులు తవ్వుతుండగా అడ్డుకున్న తమను బలవంతంగా పోలీసులతో ఖాళీ చేయించారని, తమపై పోలీసు కేసులు పెట్టారని వాపోయారు. చేపల చెరువుల వ్యర్థాలు చెరువులో కలవడం వల్ల 16 గ్రామాలకు సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోందన్నారు. దీని వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలి కొమ్మనాపల్లిలో పలువురు మృతి చెందడంతో పాటు వందల మంది వ్యాధి బారిన పడ్డారన్నారు. దీని వలన ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నేతలకు వినతి పత్రం అందించారు. దళిత నాయకులు బుర్తి కృష్ణ, బుర్తి సింహాచలంతో పాటు టీడీపీ నాయకులు సాధనాల నూకరాజు,కొయ్యా రామకేశవ, పిర్ల శివ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉంటే వివాదానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో, రికార్డులతో హాజరు కావాల్సిందిగా యనమల రామకృష్ణుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కబ్జాకు గురైన భూములను విడిపించి దళితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

టైప్ రైటింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ సిటీ, జులై 16 : రాష్ట్రవ్యాప్తంగా 35 కేంద్రాలలో ఈ ఏడాది సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బోర్డు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి, కాకినాడ సెంటర్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పై తేదీలలో ఇంగ్లీషు, తెలుగు భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీషు జూనియర్ గ్రేడ్ పరీక్షలను, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 21,22 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా 6 కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రాన్ని రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున స్థానికంగా ఉన్న టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్స్ వారిని సంప్రదించి, సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

కాంక్రీట్ మిక్చర్‌లో పడి యువకుడి దుర్మరణం



సత్యసాయి(ఫైల్)

సామర్లకోట, జూలై 16: సామర్లకోట మండలం అచ్చంపేట సమీపాన ఒక ప్రైవేట్ కాంక్రీట్ రడీ మిక్స్ సంస్థలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తూ కాంక్రీట్ మిక్చర్‌లో పడి పిఠాపురం మండలం లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన బుర్రా సత్య సాయి(18)(సత్తిబాబు) అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని శరీరం నుజ్జునుజ్జు అయ్యింది. గుర్తించేందుకు వీలులేని స్థితికి చేరింది. సమాచారం అందిన వెంటనే సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతుల ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట, జూలై 16: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో సామర్లకోట టీటీడీసీ శిక్షణా కేంద్రంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో యువతులకు ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తున్నందున ఔత్సాహికులైన యువతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి, జిల్లా జాబ్స్ మేనేజర్ కిరణ్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు సైతం నేరుగా కల్పిస్తామని చెప్పారు. శారీస్ పెయింటింగ్స్, ఎంబ్రాయిడరీ కోర్సులలో శిక్షణా తరగతులు 15 రోజుల పాటు ఉంటాయన్నారు. ఈ కోర్సులలో చేరే యువతుల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అలాగే వారి విద్యార్హత 8వ తరగతి ఆపైన ఉండాలన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల యువతులకు మాత్రమే ఈ అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని పీడీ శ్రీరమణి, కిరణ్ తెలిపారు.

ఏజెన్సీ చోడవరంలో పేకాట డెన్

ఆదివాసీల ఆవాసాల్లో దర్జాగా పేకాట

పేకాట శిబిరంలో విలాసవంతమైన సౌకర్యాలు

చక్రం తిప్పుతున్న తెలంగాణ పేకాట నిర్వాహకులు

ఎటపాక, జూలై 16: ఎటపాక మండలం, చోడవరం గ్రామం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో అదొక మారుమూల ప్రాంతం. అక్కడ పంట పొలాల మధ్య సుమారు మూడు గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. ఆ ప్రాంతంపై తెలంగాణ పేకాట నిర్వాహకుల కన్నుపడింది. ఇంకేముందు విలాసవంతమైన పేకాట జూద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గత ఐదారు రోజులు నుంచి దర్జాగా పేకాట జూదాన్ని నిర్వహిస్తున్నారు. గిరిజనుడికి చెందిన రెండు గోదాములను అద్దెకు తీసుకుని, దానిని పేకాట డెన్‌గా మార్చారు. పేకాట నిర్వాహకులు సాయంత్రం వేళ నుంచి తెల్లవార్లు పేకాట శిబిరాన్ని నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లోపల టేబుళ్లను ఏర్పాటు చేసుకుని మూడు ముక్కలాట క్రీడను యథేచ్ఛగా ఆడిస్తున్నారు. రోజుకు రూ.వేలల్లో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణలోని బూర్గంపాడు, భద్రాచలం పట్టణాలకు చెందిన పేకాట నిర్వాహకులు ఈ శిబిరాన్ని నిర్వహిస్తూ చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. పేకాట శిబిరంలో ఆటగాళ్లకు విలాసవంతమైన వసతులను సైతం ఏర్పాటు చేస్తున్నారు. గదుల్లో ఏసీలు, ఫ్యాన్లు అమర్చుతూ జూదం సాగిస్తున్నారు. ఇక్కడే మందు, ముక్క అనేక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. దీంతో తెలంగాణ, ఏపీ ప్రాంతాల నుంచి జూదగాళ్లు ఇక్కడకు పరుగులు తీస్తున్నారు. ఆటగాళ్లు జూదంలో పాల్గొని జేబులు ఖాళీ చేసుకోని నిరాశగా వెళ్లిపోతున్నారు. కాగా ఇంత వ్యవహారం జరుగుతున్నా పోలీసులు ఈ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ పార్థసారథిని వివరణ కోరగా మంగళవారం సాయంత్రం శిబిరంపై దాడి చేశామన్నారు. అయితే పేకాటరాయుళ్లు అక్కడ నుంచి పరారయ్యారన్నారు. ఫర్నీచర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట శిబిరంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.


నిలకడగా గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, జూలై 16: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ 4 ఆర్మ్‌లలో ఉన్న 175 గేట్లకుగాను 130 గేట్లను 20మిల్లీమీటర్ల మేరపైకి ఎత్తి 78,791 క్యూసెక్కుల జలాలను దిగువకు విడిచి పెడుతున్నారు. నీటి మట్టం 10.35 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1700క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో


వరరామచంద్రాపురం, జూలై 16: మండల కేంద్రమైన వీఆర్ పురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవో చైతన్య, ఎంఈవో లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యాపకులతో మాట్లాడి కళాశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ హాస్టల్ సదుపాయం ఉంటే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, కళాశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని పీవో దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాబోవు గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ మొదలగు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మౌలానాఫాజిల్, ఐడీపీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎస్‌ఐ నాగరాజు, ఆర్ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రిన్సిపాల్‌గా సీతాలక్ష్మి



పెద్దాపురం, జూలై 16: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా బి.సీతాలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి నవోదయలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన ప్రిన్సిపాల్ సీతాలక్ష్మీని విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



జీజీహెచ్ వద్ద బంధువుల ఆందోళన

కిర్లంపూడి, జూలై 16: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో జి.కుమార్ రాజు(29) అనే వ్యక్తి తాటిచెట్టు నుంచి పడి మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం మధ్యాహ్నం కుమార్‌రాజు ఒక రైతు పొలంలో తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. హుటాహుటిన ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు కిర్లంపూడి ఎస్‌ఐ జబీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

తాగునీరు లేక ఇబ్బందులు



నీటి కోసం బోరు దగ్గర గొడ్లగూడెం వాసులు

మోతుగూడెం, జూలై 16: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ గొడ్లగూడెం గ్రామంలో తాగడానికి మంచినీళ్ల దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి తాగునీటి కష్టాలు తీరలేదని బురద నీళ్ల తాగలేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. మూడు నెలల నుంచి చేతి బోరింగ్ పని చేయడం లేదన్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీళ్ల సోలార్ వాటర్ ట్యాంక్ గత 20 రోజులు నుంచి పని చేయడం లేదు. చేతి బోరింగ్ ఉన్నా సరిపడ నీళ్లు రావని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి మన్యం సమస్యలు



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం, జూలై 16: రంపచోడవరం, చింతూరు డివిజన్లలో సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారాలు చూపాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విన్నవించారు. సోమవారం కలెక్టరు పర్యటనలో పాల్గొన్న ఆమె పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలపై చర్చించారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల అంశంపై కలెక్టర్‌కు వివరించారు. గోదావరికి వరదలు వస్తున్న వేళ తీసుకోవాల్సిన పునరావాస చర్యలు, వరద సహాయం వంటి అంశాలపై చర్చించారు. గత కొన్నేళ్లుగా జరగని రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పాలకమండళ్ల సమావేశాలను తిరిగి నిర్వహించాలని కోరారు.

రంప ఏరియా ఆస్పత్రి వ్యవహారాలపై విచారణకు ఆదేశించిన కలెక్టర్

రంపచోడవరం, జూలై 16: రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వ్యవహారాలపై అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ విచారణకు ఆదేశించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'రంప ఏరియా ఆసుపత్రికి సుస్తీ' శీర్షికన ప్రచురితమైన కథనం, ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది మధ్య వివాదాలు, ఒకరిపై ఒకరు చేసుకున్న ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఆస్పత్రిని కలెక్టరు తనిఖీ చేశారు. వార్డులు తిరిగి పారిశుధ్యం, ఆహారం, మందులు, ఇతర ఆరోగ్య సేవలు, వస్తు సరఫరా అంశాలను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో పలు లోపాలను గుర్తించారు. వైద్యుల మధ్య లోపించిన సమన్వయాన్ని గుర్తించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిపై పలు ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమేనని, సదరం క్యాంపు నిర్వహణ, మధ్యవర్తుల జోక్యంపై కూడా ఫిర్యాదులు వచ్చాయని, ఈ అంశాలన్నింటిపైనా విచారణ జరుపుతామని అన్నారు. రంపచోడవరం ఆసుపత్రిలో అన్ని వైద్య వనరులు, వైద్యులు, సిబ్బంది పుష్కలంగా ఉన్నారని ఇటువంటి ఆసుపత్రిని మెరుగైన ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టరు స్పష్టం చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో, డీసీహెచ్ఎస్‌లు ఈ ఆసుపత్రిని పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ పరిశీలన



స్ప్రేయింగ్ పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో శిరీష

రంపచోడవరం, జూలై 16: మండలంలోని గిన్నెపల్లి, జీ.తాడివాడ గ్రామాల్లో జరుగుతున్న మలేరియా దోమల మందు పిచికారీని మంగళవారం ఏడీఎంహెచ్‌వో శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో నమోదైన మలేరియా కేసుల ట్రీట్మెంట్ క్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాసరాజు, వైద్యాధికారి అపూర్వ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

దేవీపట్నం, జూలై16: మండలంలో ముంపునకు గురైన 44 గ్రామాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికు దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, నిర్వాసితులు వినతిపత్రాన్ని అందజేశారు. గోకవరం మండలం గంగాలమ్మతల్లి గుడి ఆలయ సమీపంలో దేవీపట్నం గ్రామానికి సంబంధించి గృహ నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయన్నారు. గిరిజన, గిరిజనేతర రైతులకు భూ నష్టపరిహారం, కోర్టులో భూవివాదం, గ్రామాన్ని ఖాళీ చేసిన సమయానికి 18ఏళ్లు నిండిన యువతీయువకులకు ప్యాకేజీ ఇవ్వాలని తదితర సమస్యలను వివరించారు. కార్యక్రమంలో లంకా హరిశ్చంద్రుడు, సిద్దా సత్యనారాయణ, గేదల చినసుబ్బారావు, దొడ్డా సింహాద్రి, రొంగల రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

డ్రమ్ సీడర్ విధానంలో సాగు



ఎటపాక, జూలై 16: వ్యవసాయ సాగులో ఆదివాసీలు అధునాతన విధానాన్ని అవలంబిస్తున్నారు. మంగళవారం విస్సా పురం గ్రామంలో గిరిజనులు అధునాతన యంత్రాలతో వెద వరి సాగును ప్రారంభించారు. డ్రమ్ సీడర్ యంత్రం సహాయంతో వరి విత్తనాలను విత్తారు. ఈ సాగుతో రూ.7 వేల పెట్టుబడులను ఆదా చేసుకోవచ్చని ఏవో రాబిన్ తెలిపారు. ఎకరానికి 8 నుంచి 12 కిలోల వరి విత్తనాలు సరిపోతాయని చెప్పారు. ఐటీసీ ఆధ్వర్యంలో కొందరు గిరిజన రైతులకు ఈ యంత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ సాగర్ భాటియా, రైతులు వాడే రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

కూనవరం జూలై 16: కూనవరం మండలం, టేకులబోరు గ్రామానికి చెందిన కందుల నాగమణికి చింతూరు ఆయుర్వేదిక్ వైద్యులు, టీడీపీ నాయకుడు జమాల్‌ఖాన్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాగమణి భర్త ప్రశాంత్ ఇటీవల మృతి చెందడంతో తన వంతు ఆర్థిక సాయం అందించారు.

ఎస్టీయూ నగరశాఖ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16: ఎస్టీయూ రాజమహేంద్రవరం నగరశాఖ అధ్యక్షుడిగా ఏ.విశ్వేశ్వరరావు నియమితులయ్యారు. మంగళవారం ఎస్టీయూ నగర శాఖ నియామకం జరిగింది. నగర ప్రధాన కార్యదర్శిగా డీఎస్ఎస్.మూర్తి, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సీతారామయ్య, సహాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శులుగా ఎస్ఎస్ఎన్ ప్రసాద్, ఎస్.రవికుమార్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు చేపట్టారు.

ఇదేం పారిశుధ్య నిర్వహణ?

- చెత్తాచెదారంతో నిండిపోతున్న వీధులు
- నివాస గృహాల మధ్య పశువుల శాలలు
- సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని గోకవరం ప్రజల్లో భయాందోళన



గోకవరంలోని ఓ వీధిలో రోడ్డు వెంబడి చెత్త, చెదారాలు

గోకవరం, జూలై 16: పాలకుల నిర్వాకం, అధికారుల నిర్లక్ష్యం వెరసి గ్రామాలకు శాపంగా మారాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువవ్వడంతో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అమలు జరగడంలేదు. మేజర్ పంచాయతీయైన గోకవరంలో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉంది. సరైన చర్యలు తీసుకోకపోవడంతో గ్రామంలోని పలు వీధులు చెత్త, చెదారాలతో నిండిపోయాయి. డంపింగ్ యార్డులకు చేరాల్సిన చెత్త రోడ్ల పక్కన పేరుకుపోయి ప్రజలకు అసౌకర్యంగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో నిల్వ ఉన్న వ్యర్థ పదార్థాల నుంచి వచ్చే దుర్వాసనను స్థానికులు భరించలేకపోతున్నారు. నివాస గృహల మధ్య పశువులను కట్టడం వల్ల ఆ ప్రాంతంలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఈ విషయమై పంచాయతీ అధికారులు పశు యజమానులను ఎన్నిమార్లు హెచ్చరించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఏ రోగాల బారిన పడాల్సి వస్తుందోనని చుట్టు పక్కల వారు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు సరిగ్గా పారడంలేదు. దీంతో దోమలు విస్తారంగా పెరిగిపోయాయి. రాత్రియైతే చాలు ఈగల్లా ముసురుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో తాము ఏ ప్రమాదం బారిన పడతామేమోనని గ్రామస్థులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో దోమల మందును పంచాయతీ సిబ్బంది పిచికారీ చేసేవారు. కాలువల్లో దోమలు వ్యాప్తి చెందకుండా మందు చల్లేవారు. ఇపుడు అటువంటి చర్యలేమీ కానరావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గోకవరంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సేవకు నిలువుటద్దం అమ్మిరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే వర్ధంతి సభలో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జులై 16: అనపర్తి ఎమ్మెల్యేగా సేవలందించిన పడాల అమ్మిరెడ్డి ప్రజాసేవకు నిలువుటద్దంగా నిలిచారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డి 38వ వర్ధంతి సందర్భంగా మంగళవారం అనపర్తిలోని జీబీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ 1978లో ఎమ్మెల్యేగా గెలుపొందిన అమ్మిరెడ్డి, గొలుగూరి బాపిరాజుతో కలిసి మహిళా విద్య ప్రాధాన్యతను గుర్తించి అనపర్తిలో కళాశాల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ప్రజా విరాళాలతో నెలకొల్పిన విద్యాసంస్థ నేడు వ్యవస్థాపకుల ఆశయాలను వెరవేర్చలేక పోతుందన్నారు. కళాశాల ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలా మారిందని, జవాబుదారీ లేకుండా పోయిందన్నారు. అమ్మిరెడ్డి తనయుడు పడాల రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సత్తి రామారెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.అబ్బాయిరెడ్డి, రత్నారెడ్డి, డీవీఆర్ఏ పాపిరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి వర్ధంతి సభకు ఎమ్మెల్యే నల్లమిల్లి విచ్చేసి ఆయన అమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు వ్యక్తులు అమ్మిరెడ్డిని వినియోగించుకుని ఆర్థికంగా ఎదిగి ఆయనను నేడు మర్చిపోవడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. రాజకీయాల్లో ప్రజలు ఏ అధికారమిచ్చినా నిర్వర్తించాలని, పిరికిపందలుగా పారిపోకూడదన్నారు. కార్యక్రమంలో పడాల అమ్మిరెడ్డి కుమారుడు పడాల వెంకటరామారెడ్డి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, కూటమి నాయకులు రావాడ నాగు, ఇందల వీరబాబు, డీవీఆర్, కర్రి శ్రీనివాసరావు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు పాల్గొన్నారు. అంతకు ముందు అమ్మిరెడ్డి విగ్రహానికి రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ నివాళులర్పించారు.



బిక్కవోలు: కొమరిపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ఎన్డీయే కట్టుబడి ఉంది

అనపర్తి, జులై 16: ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని ఐఎల్‌టీడీ వద్ద మంగళవారం రాత్రి మసీదు పెద్దల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు షేక్ దరియా సాహెబ్ మాట్లాడుతూ చంద్రబాబు జైలు నుంచి క్షేమంగా తిరిగి రావాలని నాడు నల్లమిల్లి ఆధ్వర్యంలో అల్లాను ప్రార్థించి మొక్కుకున్నామని.. ఆయన క్షేమంగా తిరిగి రావడం, కూటమి విజయం సాధించడంతో ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

క్రిస్టియన్ కమ్యూనిటీ భవన నిర్మాణంపై వినతి

అనపర్తి మండలంలో క్రిస్టియన్ కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే నల్లమిల్లిని కోరారు. మంగళవారం రామవరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసిన ప్రతినిధులు పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ నాయకులు తోట విజయరావు, టి.సర్జన్‌రాజు, రత్నంరాజు, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16: రాజమహేంద్రవరంలో ప్రతి ఇంటా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయాలని కార్పొరేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధుల నియంత్రణ, నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేయాలన్నారు. నగరంలో ఆర్‌వో ప్లాంట్ నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా యజమానులు జాగ్రత్త వహించాలని సూచించారు.కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ప్రతి ఇంటికి వెళ్లి వైద్యపరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో మునిసిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, ఎస్ఈ పాండురంగారావు, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గత అక్రమాలపై నిలదీస్తున్నందుకే ఆరోపణలు

- ఎన్ఎంఈ లూథరన్ చర్చి ఫాదర్ అనిల్‌కుమార్

ధవళేశ్వరం, జూలై 16: ధవళేశ్వరంలోని ఎన్ఎంఈ చర్చిలో ఎటువంటి నిధులు దుర్వినియోగం జరగలేదని, గత అక్రమాలపై నిలదీస్తున్నామనే పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఫాదర్ అనిల్‌కుమార్ అన్నారు. చర్చిపై అధికారం కోసం నెల రోజులుగా కొందరు తన విధులకు ఆటంకం కలిగిస్తూ దైవారాధన జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం చర్చి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ జి.కిరణ్‌బాబు, చర్చికి రానటువంటి మరి కొందరితో గందరగోళం సృష్టించి ఆరాధనను అడ్డుకుంటున్నారని దీనిపై రెవెన్యూ అధికారులు, పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారని అయినా వీరి తీరు మారలేదన్నారు. చర్చికు వచ్చే ఆదాయంలో ప్రతి పైసాకు లెక్కలు ఉన్నాయని తేల్చి చెప్పారు. ట్రెజరర్ పి.ప్రవీణ్ మాట్లాడుతూ రూ.80లక్షల చర్చి నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు చేస్తున్న వారు దానిని రుజువు చేస్తే ఏ శిక్షకైనా తాను సిద్ధమని లేకుంటే ఆరోపణలు చేసిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. మరో మూడుసంవత్సరాలు సర్వీసు పూర్తిచేయాల్సిన పాస్టర్ అనీల్‌కిరణ్‌ను సాగనంపడానికి చేస్తున్న కుటిల యత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో అడహక్ కమిటీ సభ్యులు లలితా మోజెస్, కిషోర్, పాల్‌మహేష్, ఆర్.మణికుమారి, ఎ.అరుణ, గంధం రమణ,బూసి రజని పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ అనిల్‌కుమార్

డయేరియాతో అప్రమత్తంగా ఉండాలి



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రంగంపేట, జూలై 16: డయేరియా, సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అధికారులు అప్రమత్తంగా ఉండి ఎవ్వరూ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ సూచించారు. మంగళవారం రంగంపేటలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది కలిసి గ్రామంలో పీహెచ్‌సీ నుంచి ఏడీబీ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలు చేసి మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరత్నం మాట్లాడుతూ ఈ నెల 1నుంచి స్టాప్ డయేరియా కార్యక్రమం ప్రారంభించి మండలంలో పలు పంచాయతీల్లో సుమారు 150 డ్రైన్లలో పూడిక తొలగించామని, చెత్త కుప్పలను, 60 నీటి నిల్వ కుంటలను తొలగించామని తెలిపారు. అలాగే 37 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను, 22 జీఎల్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఉండవిల్లి గిరిబాబు, ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఆళ్ల బాబి, దూబాసి వరప్రసాద్, మండవిల్లి గుప్త, ఐసీడీఎస్ సీడీపీవో జెస్సిఫ్లోరెన్స్, పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మీ, చిన్నారావు, సంకీర్తన, సీహెచ్‌వో కె.జయమణి, పంచాయతీ కార్యదర్శి పి.సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఐదుబళ్ల మార్కెట్ ప్రాంతంలో వీరగంట మురళి తన కుటుంబంతో జీవిస్తున్నాడు. తన అన్న భీష్మ భార్య చనిపోవడంతో మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. మంగళవారం సాయంత్రం రైల్వే స్టేషను సమీపంలో డ్రైవరు అజాగ్రత్త వల్ల తన అన్న తలపై నుంచి బస్సు వెళ్లడంతో మృతి చెందాడని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

బంగారం చోరీ

బంగారు ఆభరణాల చోరీపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉమర్ వివరాల ప్రకారం.. నేతాజీనగర్‌లో పెద్ది స్వాతి ఆమె భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన రైల్వేలో పని చేస్తారు. గత నెల 16న సుమారు 80గ్రాముల బంగారు ఆభరణాలు మాస్టర్ బెడ్‌రూంలోని ఓ సూట్‌కేస్‌లో పెట్టారు. ఈ నెల 8న ఆ పెట్టె తెరిచి ఉండడం గమనించి చూడగా బంగారు ఆభరణాలు లేకపోవడం గుర్తించారు. ఈ మేరకు మంగళవారం ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సీతానగరం, జూలై 16: మండలంలోని మునికూడలి గ్రామంలో దుర్గమ్మ గుడి పంత రోడ్డులో కవల కృష్ణమూర్తి పొలంలో కాలువ బోదెలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ టి.రామకృష్ణ వివరాల మేరకు కవల కృష్ణమూర్తి పొలంలోని కాలువ బోదెలో వేపచెట్టుకు ఉరివేసుకుని చెట్టుకింద కాలువలో పడి ఉన్నట్టు మునికూడలి వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు హెచ్‌సీ బి.లక్ష్మణరావు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలిరంగు స్ట్రైప్స్ గల చొక్కా, నీలం రంగు జీన్‌ఫ్యాంటు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

పీఎంపీలకు అవగాహన సదస్సు



వైద్య నిపుణులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 16: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించే పీఎంపీలు వ్యాధుల పట్ల అవగాహన కలిగా ఉండాలని ప్రముఖ గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ రామ్‌గోపాల్ తేజ అన్నారు. హుక్కుంపేటలో కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీర్ణాశయ వ్యాధులకు నేటి ఆహారపు అలవాట్లే కారణం అన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ బీఎస్.మాణిక్యాంబ(బాల) మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులను ఎలా గుర్తించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి శాఖ అధ్యక్షుడు రహమాన్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కోశాధికారి పి.చిన్ని,మండల కార్యదర్శి మట్టా రమేష్,కోశాధికారి యుగ్రప్రసాద్ బాబు, ఏ.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి వినియోగదారుల సమస్యలు



కలెక్టర్ ప్రశాంతిని కలిసి మొక్కను అందిస్తున్న అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16: జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో వినియోగదారుల సమస్యలను విన్నవించారు. జిల్లా వినియోగదారుల రక్షణ చట్టం అమలుకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బలోపేతానికి కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బందికి కనీస వేతనాలివ్వాలి

ప్రైవేట్ హాస్పటల్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పూర్ణిమరాజు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 : ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని ప్రైవేట్ హాస్పటల్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన ది రాజమండ్రి ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సులు, కాంపౌండర్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు కనీస వేతనం ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో ఏడిద నాగేశ్వరరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీను మాట్లాడుతూ యూనియన్ మహాసభ ఆగస్టు 25న జరుగుతుందన్నారు. యూనియన్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక



ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16: ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నూతన కార్యవర్గంలో డివిజన్ గౌరవాధ్యక్షుడిగా తుమ్మల తాతారావు, అధ్యక్షుడిగా ఎంసీహెచ్ అప్పలరాజు, డివిజన్ సెక్రటరీగా పిల్లి వైవీ ప్రసాద్, కోశాధికారిగా కుసుమ శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.మాధవరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఐ.దుర్గాప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా పి.నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా బి రత్నరాజు ,ఉపాధ్యక్షుడిగా ఎన్‌వీవీ సత్యనారాయణలను ఎన్నుకున్నారు. కంపెనీ గౌరవాధ్యక్షుడు కాశీ మోహనరావు, కార్యదర్శి పీఎస్ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అంబటి రాజారత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చిన వెంకట్రావు, టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ ముప్పిడి గణేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

జేగురుపాడులో పూడికతీతలు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కూటమి నాయకులు

కడియం, జూలై 16: జేగురుపాడులో డ్రైనేజీలు పూర్తిగా పూడిక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఉన్నతాధికారులకు తెలియపర్చడంతో వారు స్పందించి సిబ్బందితో పూడికతీత పనులు చేపట్టారు. పనులును కూటమి నాయకులు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, వల్లూరి మోహనరావు, కర్రి చినబాబు, సూర్యకుమార్, వనమాలి పాల్గొన్నారు.

రావిపాటి పురస్కారాలకు 17 మంది ఎంపిక


కోరుకొండ, జూలై 16: రిటైర్డ్ ఏపీ జాయింట్ సెక్రటరీ దివంగత రావిపాటి శ్రీనివాసరావు ప్రతిభా పురస్కారాలకు 17 మంది విద్యార్థులు ఎంపికైనట్టు శ్రీనివాసరావు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కోలా సత్యనారాయణ తెలిపారు. 1000 మంది విద్యార్థులు చదువుకుంటున్న కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పదేళ్ల క్రితం రావిపాటి శ్రీనివాసరావు ప్రతిభా పురస్కారాలు కోసం రూ.6లక్షలు నిధిని ఏర్పాటు చేశారని, దానిపై వచ్చే సుమారు రూ.50 వేలు వడ్డీతో ఏటా ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది 17 మంది విద్యార్థులు ఎన్నికైనట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 18న కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో జరిగే కార్యక్రమంలో ప్రతిభాపురస్కారాలు అందజేయనున్నట్టు ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 17 జూలై 2024 | 5





'చెట్టంత' కష్టం!



గోష్పాదక్షేత్రంలో 120 ఏళ్ల రావిచెట్టు కొట్టివేత

ఆ రావి చెట్టు అంటే ఎంతో మందికి సెంటిమెంట్.. ప్రతి రోజూ పదుల సంఖ్యలో జనం వచ్చి ఆ చెట్టు కింద సేదతీరే వారు.. పండుగలు..ప్రత్యేక పర్వదినాల్లో అయితే ఆ సంఖ్య వేలల్లో ఉంటుంది.. ఇప్పటి వరకూ ఆ చెట్టు కింద కోట్లాది మంది సేద తీరి ఉంటారు.. ఇక బోలెడు సినిమా షూటింగ్‌లు జరిగాయి. ఎందుకంటే ఆ చెట్టు వయసు 120 సంవత్సరాలు. ఆ చెట్టుకు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో.. అఖండ గోదావరి ఒడ్డున ఉండడం.. అంతటి ప్రాముఖ్యత ఉన్న చెట్టును మంగళవారం అడ్డంగా నరికేశారు.. కొమ్మలను ఇష్టం వచ్చినట్టు కొట్టేశారు.. పచ్చని ఆకులతో.. చుట్టూ కొమ్మలతో కనువిందు చేసే ఆ చెట్టు ప్రస్తుతం బోసిపోయింది. ఈ చెట్టు ఎవరికైనా అడ్డుగా ఉందా అంటే అదీ కాదు.. ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఒక కొమ్మ విరిగిపడింది.. మునిసిపల్ సిబ్బంది ఏం చెప్పారో ఏమో కానీ.. ఆ కొమ్మను తీయడానికి వచ్చిన పనివారు.. చెట్టంతా కొట్టేశారు.. సుమారు 70 శాతం నరికివేసి మోడుగా మిగిల్చారు ఆ చెట్టు కింద పలు రకాల విగ్రహాలు ఉన్నా పట్టించుకోలేదు.. కనీసం ఆ చెట్టుపై కరెంట్ తీగలు లేవు. ఎవరికీ అడ్డుగా కూడా లేదు..సాయంత్రం అయ్యే సరికి వాకింగ్ నిమిత్తం వచ్చిన పర్యావరణ ప్రేమికులు చెట్టంతా కొట్టేస్తుండడం చూసి ఆశ్చర్యపోయారు.. చెట్టు ఎవరు కొట్టమన్నారని మండిపడ్డారు.. చెట్టు కొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. చెట్టు నరికుతున్న కార్మికులను ప్రశ్నించగా విరిగిపడిన చెట్టు కొమ్మ తీసుకువెళితే మాకు గిట్టుబాటు కాదని మునిసిపల్ అధికారుల అనుమతి మేరకు ట్రాన్స్‌పోర్టుకు సరిపడా కొమ్మలు నరకడం జరిగిందని చెబుతున్నారు. 2003 గోదావరి పుష్కరాల సమయంలోనూ వందేళ్ల వయసున్న ఈ చెట్టును అప్పటి అధికారులు తొలగించకుండా ఉంచారు. దేవతా వృక్షాన్ని నరికివేయించిన అధికారులపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. - కొవ్వూరు

రావిచెట్టు పుల్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.. అన్ని పుల్లలు దొరికినట్టు దొరకదు. ఎందుకంటే ఎక్కడా రావిచెట్టును కొట్టరు. దీంతో కలప దొరకడంకూడా కష్టమే. రావిచెట్టు పుల్లను ఎక్కువగా హోమాల్లో ఉపయోగిస్తారు. ట్రాక్టర్ పుల్ల ఉందంటే సుమారు రూ.లక్ష ఉంటుందని సమాచారం. డిమాండ్‌ను బట్టి ఇది మరింత పెరగవచ్చని తెలిసింది. దీంతో చెట్టంతా కొట్టేసినట్టు చెబుతున్నారు.

ఇందుకేనా కొట్టేసింది.!

చెట్టు నరికించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో దేవతా వృక్షాన్ని నరికివేసిన అధికారులపై వాల్టాచట్టం కింద కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలి. విరిగిన కొమ్మను తొలగించాల్సిన అధికారులు చెట్టును నరికించివేయడం తగదు.. వాల్టా చట్టాన్ని దుర్వినియోగ పర్చినందుకు సంబంధిత వ్యక్తులను శిక్షించాలి.

- పిల్లలమర్రి మురళీకృష్ణ, బీజేపీ కౌన్సిలర్

రేపు రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు తెలిపారు. హైకోర్టు ఆదేశాల దృష్ట్యా హెల్మెట్, సీటు బెల్టు ధరించడంతో పాటు రహదారి భద్రత నిబంధనల పాటింపుపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నుంచి కంబాల చెరువు వరకూ గురువారం ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.ర్యాలీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొంటారని పేర్కొన్నారు.



ఆసుపత్రిలో సేవలపై వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



ఆసుపత్రి ఆవరణలో బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్

రోగులకు వీల్‌చైర్లు.. స్ట్రెచర్లు అందుబాటులో ఉంచడంలేదు..

- కలెక్టర్ ప్రశాంతికి పలువురు రోగుల ఫిర్యాదు
- జీజీహెచ్‌లో తనిఖీ..ఆర్ఎంవో నెంబర్ ప్రదర్శించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 : రోగులకు వైద్యసేవలు అందజేసే విషయంలో జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించడానికి ఆర్ఎంవో ఫోన్ నెంబరును ఆసుపత్రి ఆవరణలో ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఓపీలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. క్యాజువాలిటీ వార్డును పరిశీలించారు. క్యాజువాలిటీ వద్ద రోగులకు వీల్‌చైర్లు, స్ట్రెచర్లు వంటివి అందుబాటులో ఉంచడంలేదని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల్లో ఎక్కువ మంది సాధారణ, పేద ప్రజానీకం ఉంటారని మెరుగైన వైద్యసేవలు అందజేయాలన్నారు. ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు వేచి ఉండడానికి మూడు వరుసల్లో స్టీల్ కుర్చీలకు చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు అందుబాటులో వీల్‌చైర్లు, స్ట్రెచర్ ఏర్పాటుకు, అదనపు సిబ్బందికి ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి చర్యల్లో భాగంగా త్వరలోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. రోగుల బంధువులకు అదనపు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.కృష్ణంరాజు, వైద్యులు ఉన్నారు.

హాస్టళ్ల మరమ్మతులు చేయండి..

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 : జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల వసతిగృహాల్లో సీఎస్ఆర్ నిధులతో మరమ్మతులు చేయించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సంక్షేమశాఖల అధికారులతో సంక్షేమ వసతిగృహాల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ వసతిగృహాల నిర్వహణ, మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వసతిగృహాల్లో తక్షణమే చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు.జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్,జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిణి జ్యోతి, కొవ్వూరు బీసీ సంక్షేమ అధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.



చిడిపిలో కాలినడకన వీధులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అపారిశుధ్యం అన్నారని వచ్చేశారు..

కొవ్వూరు, జూలై 16 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణపై పంచాయతీ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కొవ్వూరు మండలం చిడిపి పంచాయతీలో అపారిశుధ్య సమస్య ఉందని తెలియడంతో కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.గ్రామంలో కాలినడకన తిరిగి పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు గ్రామంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్వహణలో భాగంగా గత శనివారం ఎన్ని ట్యాంకులు శుభ్రం చేయించారని అధికారులను ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సిల్టు తొలగించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో కె.సుశీల,ఈవోపీఆర్డీ శర్మ,సెక్రటరి నరేంద్ర ఉన్నారు.

ఐదేళ్లూ.. దారిద్ర్యం!



గోతిలో పడిపోతోంది : ఇది గొయ్యి కాదండోయ్ ఏడీబీ రోడ్డే.. ఈ రహదారంతా ఇంతేనండోయ్..



దిగిపోతున్నా : పైపుల లోడ్‌తో గోతిలో దిగుతున్న వ్యాన్

రహదారులు గాలికొదిలేశారు..

గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ జగన్ ఏం చేశారు.. ఎన్నికయ్యారు.. అనుభవించారు.. సంక్షేమ ముసుగు వేసి.. అభివృద్ధి, సమస్యలను పక్కన పడేశారు.. దారిద్ర్యం మిగిల్చారు. జగన్ ఐదేళ్ల పాలనకు ఈ రోడ్డే ఒక ఉదాహరణ. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత వచ్చిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది.అయితే గత ప్రభుత్వ హయాంలో 25 శాతం పూర్తయిన పనులు ఆపేయాలని.. రివర్స్ టెండరింగ్ పేరు తో ఆదేశాలు జారీ చేశారు. అంతే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్లలో ఒక్కసారి ఆ రోడ్డు గురించి ఆలోచించలేదు.. ఇదీ 30 కిలోమీటర్ల మేర నిత్యం రద్దీగా ఉండే రాజానగరం-కాకినాడ ఏడీబీ రోడ్డు దుస్థితి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏడీబీ రోడ్డుకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్ టైర్లు ఏవీ : రోడ్డుపై ఉన్న గోతిలో మునిగిన బస్ టైర్లు

- ఏడీబీ రోడ్డుకు జగన్ రివర్స్ దెబ్బ
- రాజానగరం టూ రామేశంపేట
- 30 కి.మీ రోడ్డుకు ముప్పుతిప్పలు
- ఏడేళ్లయినా పూర్తికాని వైనం
- గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభం
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- భారీ గోతులతో ప్రమాదాలు
- కూటమి రాకతో మళ్లీ కదలిక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజానగరం నుంచి సామర్లకోట వరకూ కాకినాడ వెళ్లే ప్రధాన ఏడీబీ రోడ్డు నరకంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎటు చూసినా భారీ గోతులే. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో మరింత అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఆరంభించి ఏడేళ్లు అవుతున్నా ఇప్పటి వరకూ కేవలం 35 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

2017లో రోడ్డు పనులు ఆరంభం

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (వీసీఐసీడీపీ)లో భాగంగా రాజానగరం నుంచి సామర్లకోట వరకూ ఏడీబీ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడానికి సుమారు రూ.393 కోట్ల 43 లక్షల 81 వేల 264 అంచనాతో 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో నంబర్ 328తో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది.30 కిలోమీటర్ల మేర అభి వృద్ధి చేయాలని అప్పట్లో నిర్మ యించారు.బీఎస్ఆర్- బీఏస్సీపీఎల్ అనే జాయింట్ వెంచర్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. 2021 ఫిబ్రవరి 12వ తేదీకి దీనిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టారు.ఈ మేరకు భూసేకరణతో పాటు కొంత మేర పనులు చేపట్టారు.

ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ

ఏడీబీ రోడ్డు రెండు జిల్లాల పరిధిలో ఉంది. పొడవు 30 కిలోమీటర్లు. తూర్పుగోదావరి జిల్లాలో 16.29 కిలోమీటర్లు, కాకినాడ జిల్లా పరిధిలో 13.71 కిలోమీటర్లు పొడవు ఉంది. నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయవలసి ఉంది. దీనికి మొత్తం 57.69 ఎకరాల భూమిని సేకరించాలి. టీడీపీ హయాంలోనే కాకినాడ జిల్లా పరిధిలో 23.58 ఎకరాలను సేకరించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 34.11 ఎకరాలు సేకరించాల్సి ఉండగా కొంత మినహా మిగతాది సేకరించారు. పనులు ఆరంభించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రోడ్డుకు శనిపట్టుకుంది. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్స్ పేరిట కొద్దిరోజులు ఆపేసి.. ఎన్నికలకు సుమారు ఏడాదిన్నర ముందు అదే కాంట్రాక్టర్‌కు పనులు కొనసాగించమని చెప్పింది. కానీ చేసిన పనికి డబ్బులు ఇవ్వలేదు.మొత్తం రూ.44.12 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ ఉన్నాయి. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ మరో రూ.7.7 కోట్లు పనిచేసినా వాటి బిల్లులను సీఎఫ్ఎం ఎస్‌లో అప్‌లోడ్ చేయలేదు.2023 జూలైలో తనకు రావాల్సిన సుమారు రూ. 52 కోట్ల రూపాయల బకాయిని చెల్లిస్తేనే రోడ్డు నిర్మాణ పనులు కొనసాగిస్తానని కాంట్రాక్టర్ తెలియజేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేశారు. దీంతో ఇవాళ ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది.



అసలు రోడ్డేది : రోడ్డు కదా అని ధైర్యంగా వస్తే బురదలో దిగిన బైక్.. ఏడీబీ రోడ్డులో ఇటువంటివి సర్వ సాధారణం

కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

రోడ్డును పూర్తి చేయడానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నట్టు చెబుతున్నారు.నిధులు రాకపోవడంతో ఇప్పటికే కాంట్రాక్టర్ ఎక్విప్‌మెంట్ తరలించుకుపోయాడు. సీఎం చంద్రబాబు పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టర్ ఇప్పుడిప్పుడే తిరిగి ఎక్విప్‌మెంట్‌ను తెచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం.ప్రస్తుతం ఇబ్బందిగా ఉన్న కల్వర్టులను బాగు చేస్తున్నారు.బహుశా ఆగస్టు తర్వాత రోడ్డు నిర్మాణంలో కదలిక వస్తుందనే ప్రచారం ఉంది. వర్షాలు తగ్గిన తర్వాత పనులు ఊపందుకునే అవకాశం ఉంది.

జాతీయ రహదారిపై గోతులు

రావులపాలెం నుంచి రాజమండ్రి మీదుగా విశాఖ వెళ్లే జాతీయ రహదారిలో కూడా అనేక చోట్ల గుంతలు పడ్డాయి.మరమ్మతులు చేస్తున్నా చాలా చోట్ల ఇబ్బందిగా ఉంది. కొన్ని చోట్ల లెవల్స్ సరిగా లేకపోవడంతో వాన నీరు నిలిచిపోతోంది. చెత్తాచెదారం, మట్టిపేరుకు పోతోంది.గామన్ బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డులో దివాన్‌చెరువు నుంచి గామన్ బ్రిడ్జి వరకూ రోడ్డు తారు జరిగిపోయి, గాడులుగా మారింది.దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



తాత్కాలిక మరమ్మతులు..

రంగంపేట, జూలై 16 : రాజానగరం నుంచి రామేశంపేట వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా తయారై ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో గోతులు చెరువులను తలపిస్తున్నాయి.ప్రతి రోజూ ప్రయాణికులు వాహనాలతో గోతులలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చొరవతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి తక్షణమే ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు తిరిగి చేపట్టాలని కోరారు. ఈ మేరకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు.ఎస్టీ రాజాపురం పెట్రోల్‌బంక్ వద్ద కల్వర్టు పూర్తిగా మూసుకుపోవడంతో దానిని పూర్తిగా తొలగించి దాని స్థానంలో తూరలు ఏర్పాటు చేశారు.దీంతో వాహనదారులకు కొంత ఇబ్బంది తొలగింది. మరమ్మతు పనులను ఏడీబీ రోడ్డు డీఈఈ భాస్కరరావు,ఏఈఈ బి.ఆదినారాయణ వర్మ పర్యవేక్షించారు.రాబోయే పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తిస్థాయిలో తిరిగి చేపడతామని కాంట్రాక్టర్ యంత్రాలను సమకూర్చుకుంటున్నారని డీఈఈ భాస్కరరావు తెలిపారు.

ఎస్పీ జగదీశ్‌కి ఘన వీడ్కోలు



ఎస్పీని మోస్తూ జై కొడుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎంతకాలం పని చేశామా అనేది కాదు.. ఎంత మంది అభిమానం సంపాదించానేదే ముఖ్యం. ఎస్పీ జగదీశ్ పది నెలలే జిల్లాలో ఉన్నా ఆయన సిబ్బందికి ఎంతో దగ్గరయ్యారు. అయితే ఇటీవల ఆయన బదిలీ కావడంతో మంగళవారం అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆయనను పూలతో అలంకరించిన వాహనం ఎక్కించి అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలతో సహా అందరూ తాడుతో లాగుతూ పూలవర్షం కురిపించి జేజేలు కొట్టారు. కిందిస్థాయి సిబ్బంది ఆయనను భుజాలపై ఎత్తుకొని అభిమానాన్ని చాటుకున్నారు. ఎస్పీ జగదీశ్ హోదాతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ తమ కుటుంబ సభ్యుడి మాదిరిగా ఆదరించారని కొందరు భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రాకుండా పోలీస్ స్టేషన్లలో జూమ్ యాప్‌ని ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల నుంచే ఎస్పీకి సమస్య వివరించే విధానం తీసుకొచ్చార న్నారు. అర్జీలు ఇవ్వడానికి జిల్లా కార్యాల యానికి వచ్చే బాధితులు తిరిగి వెళ్లడానికి వాహనాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎస్పీ జగ దీశ్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ పూర్తి సహకారం అందించార న్నారు. జిల్లాలో విధులు సంతృప్తినిచ్చాయన్నారు. అంతకుముందు పోలీసు శిక్షణ మైదానంలో అడి షనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. రిజర్వు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ డి.ప్రభాకర్, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రఘురాం, ఉపాధ్యక్షుడు జె.సాయి మహేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇదీ నా టీమ్ : జిల్లాలోని ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ జగదీశ్

కష్టం వస్తే..181కు కాల్ చేయండి

మహిళలకు వన్ స్టాప్ సెంటర్ కన్వీనర్ సౌజన్య సూచన



నల్లజర్ల,జూలై 16 : ప్రభుత్వం నిర్వహించే సఖీ వన్ స్టాప్ సెంటర్ (ఓ ఎస్‌సీ)ను 5 నుంచి 60 ఏళ్లపైబడిన మహిళలు ఉపయోగించుకోవాలని వన్ స్టాప్ సెంటర్ కన్వీనర్ కె.సౌజన్య, ఏలూరు ఆర్‌జెడీ నోడల్ అధికారిణి స్వరాజ్యలక్ష్మి అన్నారు. నల్లజర్ల సీడీపీవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు,కిశోర బాలికలు,కొత్తగా పెళ్లయిన మహిళలకు సఖీ వన్ స్టాప్ సెంటర్ అందించే సేవలపై అవగాహన కల్పించారు.గ్రామాల్లో మహిళలు టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫిర్యాదు చేసే వారికి వసతి కల్పించి తగిన రక్షణతో పాటు లీగ్ సపోర్టు కల్పిస్తామన్నారు. మహిళలు ఎటువంటి సమస్యతో బాధపడుతున్నా 181కు కాల్ చేస్తే తగిన న్యాయం జరుగుతుందన్నారు.ప్రతి జిల్లాలో వన్ స్టాప్ సెంటర్ ద్వారా సేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు.నిరాధారంగా ఉన్న మహిళలు,అనాథలను శక్తినివాసాల్లో చేర్పిస్తామన్నారు.ఉమెన్ హెల్ లైన్ 181,చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేసి సమస్యపరిష్కరించుకోవాలన్నారు.ఈవో అపరంజిని,సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి,కృష్ణవేణి, పాల్గొన్నారు.

ఆధార్, ఇంటి ప్లాన్ ఉంటేనే.. ఉచిత ఇసుక 8

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వేగేశ్వరపురంలో పారిశుధ్యంపై కలెక్టర్ తనిఖీ



వేగేశ్వరపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి, జూలై 16: మండలంలోని వేగేశ్వరపురంలో సచివాలయానికి శానిటేషన్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ ప్రశాంతి మంగళవారం విచ్చేసి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలు, వాటర్ ట్యాంక్ నిర్వహణపై సిబ్బందిని ప్రశ్నించి క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులపై సమగ్ర సమాచారాన్ని అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, స్థానిక అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తికి అవకాశం ఉండడంతో గ్రామంలో ఎక్కడా నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని, జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక మేదర పేటకు చెందిన రోడ్డులో నిలిచి ఉన్న నీటిని కాలవల ద్వారా బోదిలోకి తరలించాలన్నారు. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని ఆర్అండ్‌బీ, సర్వే శాఖల ద్వారా గ్రామంలో హద్దులు గుర్తించి డ్రైనేజీలు, కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ, కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

తాళ్లపూడి, జూలై 16: యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం స్థానిక కరిబండి విద్యాసంస్థల్లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగించారు. విద్యార్థులు మద్యం, సిగరెట్, గంజాయి వల్ల మానసికంగా, శారీరకంగా నాశనం అవ్వడమే కాకుండా సమాజంలో గుర్తింపును కోల్పోతారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మురళీ, మాధవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో డ్రైనేజీలు అధ్వానం

తాళ్లపూడి, జూలై 16: తాళ్లపూడిలో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయని, గతంలోనే ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా పరిష్కారం కాలేదని తెలుపుతూ బీజేపీ, జనసేన నాయకులు అన్నారు. గ్రామంలోని గ్రంథాలయం వీధిలో చాలాకాలంగా డ్రైనేజీ పూడికుపోయి మురికినీరు వర్షాకాలంలో రోడ్డుపైకి చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఆశాఅలేఖ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కలిశెట్టి సన్యాసిరాయుడు, అయితం మణికంఠ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సాగిపాడులో మొక్క నాటుతున్న సర్పంచ్ అచ్చిబాబు, నాయకులు

గోపాలపురం, జూలై 16: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యత అని దొండపూడి సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు అన్నారు. ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన కొబ్బరి మొక్కలను మండలంలోని దొండపూడి, సాగిపాడు గ్రామాల్లో మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ముత్యాలరాయుడు, జనసేన మండలాధ్యక్షుడు పోల్నాటి రాజేంద్ర, గని రాజు, షేక్ బీర్‌సాహేబ్, వీరాస్వామి, షేక్ హుస్సేన్, మద్దాల కాశీవిశ్వనాథ సనారి, సోమరాజు, వెల్లంకి జయశివసూర్యం, మల్లిపూడి డేవిడ్ పాల్గొన్నారు.

172 సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమోదం

నిడదవోలు, జూలై 16: కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వడంతో నియోజకవర్గంలో సుమారు రూ.10.29 కోట్లతో 172 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలో 172 సీసీ రోడ్ల పనులు చేపట్టేందుకు కలెక్టర్ పరిపాలన ఆమోదం ఇచ్చినట్టు తెలిపారు. ఈ మేరకు వెలగపూడి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

తీపర్రులో విద్యుత్ లైన్ల ఆధునీకరణ పనులు



పెరవలి, జూలై 16: వర్షం వచ్చినా గాలి దుమారం వచ్చినా తీపర్రు విద్యుత్‌లైన్‌లకు అంతరాయం కలిగేది. అయితే ప్రస్తుతం పెరవలి సబ్‌స్టేషన్ నుంచి తీపర్రు ఫీడర్ విద్యుత్‌లైన్లను ఆధునీకరించడంతో ఆ సమస్య తీరింది. పెరవలి ఏఈ డేవిడ్ నిశ్చల్ మాట్లాడుతూ సుమారు రూ.7 లక్షల వ్యయంతో మూడు రోజులుగా విద్యుత్ లైన్ల పనులు పూర్తి చేశామన్నారు. ఒక వైపు వర్షం వస్తున్నా మరో వైపు పొలాల్లో బురదమయంగా ఉన్న తమ సిబ్బంది పనులు పూర్తి చేశారన్నారు. దీంతో తీపర్రు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఉండ్రాజవరం జూలై 16: మండలంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో జేడీవీ ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో డ్రైనేజీలు సక్రమంగా వెళ్లేలా, నీరు నిల్వ ఉంటే తొలగిపోయేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాల్లో ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. చేతిపంపులు చుట్టూ శుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఐదుబళ్ల మార్కెట్ ప్రాంతంలో వీరగంట మురళి తన కుటుంబంతో జీవిస్తున్నాడు. తన అన్న భీష్మ భార్య చనిపోవడంతో మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. మంగళవారం సాయంత్రం రైల్వే స్టేషను సమీపంలో డ్రైవరు అజాగ్రత్త వల్ల తన అన్న తలపై నుంచి బస్సు వెళ్లడంతో మృతి చెందాడని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

బంగారం చోరీ

బంగారు ఆభరణాల చోరీపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉమర్ వివరాల ప్రకారం.. నేతాజీనగర్‌లో పెద్ది స్వాతి ఆమె భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన రైల్వేలో పని చేస్తారు. గత నెల 16న సుమా రు 80గ్రాముల బంగారు ఆభరణాలు మాస్టర్ బెడ్‌రూంలోని ఓ సూట్‌కేస్‌లో పెట్టారు. ఈ నెల 8న ఆ పెట్టె తెరిచి ఉండడం గమనించి చూడగా బంగారు ఆభరణాలు లేకపోవడం గుర్తించారు. ఈ మేరకు మంగళవారం ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సీతానగరం, జూలై 16: మండలంలోని మునికూడలి గ్రామంలో దుర్గమ్మ గుడి పుంత రోడ్డులో కవల కృష్ణమూర్తి పొలంలో కాలువ బోదెలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ టి.రామకృష్ణ వివరాల మేరకు కవల కృష్ణమూర్తి పొలంలోని కాలువ బోదెలో వేపచెట్టుకు ఉరివేసుకుని చెట్టుకింద కాలువలో పడి ఉన్నట్టు మునికూడలి వీఆర్వో ఇచ్చిన సమాచారం మేరకు హెచ్‌సీ బి.లక్ష్మణరావు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలిరంగు స్ట్రైప్స్ గల చొక్కా, నీలం రంగు జీన్‌ప్యాంటు ఉన్నాయ న్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

ఎస్టీయూ నగరశాఖ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16: ఎస్టీయూ రాజమహేంద్రవరం నగరశాఖ అధ్యక్షుడిగా ఏ.విశ్వేశ్వరరావు నియమితులయ్యారు. మంగళవారం ఎస్టీయూ నగర శాఖ నియామకం జరిగింది. నగర ప్రధాన కార్యదర్శిగా డీఎస్ఎస్.మూర్తి, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సీతారామయ్య, సహాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శులుగా ఎస్ఎస్ఎన్ ప్రసాద్, ఎస్.రవికుమార్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు చేపట్టారు.

ప్రతి శాఖకు వాట్సాప్ గ్రూపులు ఉండాలి

- గోపాలపురంలో శాఖల మధ్య సమన్వయ లోపం
- ప్రతి సమస్యను వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలి
- అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి



దేవరపల్లి, జూలై 16: శాఖల మధ్య సమన్వయం లేకపోతే సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని కరుటూరి కల్యాణ మండపంలో నియోజక వర్గ స్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమా వేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. పక్క నియోజకవర్గాలతో పోలిస్తే గోపాలపురం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని, పాలకులు, ప్రభుత్వాలు మారినా క్షేత్ర స్థాయిలో పారిశుధ్యం, తాగునీరు, మురుగునీటి నిర్వహణ వంటి చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడానికి శాఖల సమన్వయ లోపమే ప్రధాన కారణమన్నారు. నియోజకవర్గం ఏర్పడి దశాబ్దాలు గడిచినా అభివృద్ధికి నోచుకోని పల్లెలు ఇంకా ఉన్నాయన్నారు. పార్టీలకు అతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ప్రతీ శాఖ అధికారులు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించడానికి నల్లజర్ల మండలంలో డిజిటల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రతి నెలా ఇదే తరహాలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా మీరు తీసుకున్న నిర్ణయం అద్భుతంగా ఉందని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రతీ సమస్యను వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అలాగే లా అండ్ ఆర్డర్‌ను గాడిలో పెట్టడానికి పోలీసులు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. గంజాయి, సారా, డ్రగ్స్ పేరు చెప్పడానికే భయపడేలా పోలీసులు పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 1న పింఛన్ల పంపిణీలో గోపాలపురం మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపిన ఎంపీడీవో రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా డీఎల్‌పీవో దాసరి రాంబాబు, ఏలూరు డీఎల్‌పీవో తూతిక శ్రీనివాస్, డ్వామా పీడీ ఏ.ముఖలింగం, టీడీపీ నాలుగు మండలాల అధ్యక్షులు రొంగలి సత్యనారాయణ, ఆండ్రూ అనీల్, తాతిన సత్యనారాయణ, లంకా సత్యనారాయణ, దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు త్వరలో టిడ్కో ఇళ్లను అప్పగిస్తాం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



టిడ్కో గృహాలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 16: అతి త్వరలో టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా కొవ్వూరులోని టిడ్కో గృహాలను నాయకులు, అధికారులతో కలసి ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19లో పట్టణ ప్రాంతాల్లోని పేదలందరికీ సొంత ఇంటి కల నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టారు. పట్టణంలో 240 సింగిల్ బెడ్ రూమ్‌లు, 240 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి వారి నుంచి షేరు ధనం కట్టించి గృహాల నిర్మాణం చేపట్టి 80 శాతం నిర్మాణ పనులు పూర్తిచేశారన్నారు. జగన్ ఐదేళ్లలో పాలనలో మిగిలిన 20శాతం పనులు పూర్తిచేసి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. లబ్ధిదారులు అప్పులు చేసి తమ వాటా సొమ్ము చెల్లించారని, వాటికి వడ్డీలు కట్టలేక, ఇళ్లకు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి పాలనలో టిడ్కో గృహాల పనులను పునః ప్రారంభించామని, ప్రస్తుతం తాగునీటి పైపు లైను పనులు, జంగిల్ క్లియరెన్సు పనులు జరుగుతున్నాయన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సత్యవతినగర్ మినీ బైపాస్‌రోడ్ నుంచి టిడ్కో గృహాల వరకు రోడ్డు బురదగా ఉండడంతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించామన్నారు. మరో రెండు రోజుల్లో టిడ్కో గృహాల కాంట్రాక్టర్లతో గృహనిర్మాణ శాఖ మంత్రి సమీక్షా సమావేశం ఉందన్నారు. సాధ్యమైనంత తొందరలో లబ్ధిదారులకు గృహాలను అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, కేవీకే రంగారావు, తోరం నగేష్, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక పాలసీని పారదర్శకంగా అమలుచేయాలి

దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఇసుక పాలసీని అమలుచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని 16వ వార్డు ఔరంగాబాద్ ఇసుకర్యాంపును మంగళవారం ఆయన ప్రారంభించారు. ర్యాంపులో ఉన్న ఇసుక నిల్వలను ప్రభుత్వ ఆదేశాలమేరకు టన్ను రూ.420కు విక్రయిస్తారన్నారు. ర్యాంపుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కౌన్సిలర్ కండెల్లి రామారావు, తహశీల్దార్ కె.మస్తాన్, పాకా జయరాం పాల్గొన్నారు.

ఉచిత ఇసుక కేటాయింపుల్లో మార్గదర్శకాలు పాటించాలి

- కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో సీసీ కెమెరాలు
- జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో చైర్మన్, కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. జిల్లాలోని 7 ఇసుక పాయింట్లు, 31 డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ప్రస్తుతం 3,77, 350.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని తెలిపారు. భవన నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఉచిత ఇసుక కేటాయించాలన్నారు. బల్క్ కటేటాయింపుల విషయంలో జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం మేరకే కేటాయించాలన్నారు. ఇతర జిల్లాల విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్, ఆయా జిల్లాల ఇసుక కమిటీ సిఫారసులను అనుసరించే కేటాయింపులు ఉంటాయని చెప్పారు. దీనికి సంబంధించిన విజిలెన్స్ అయా జిల్లాల పరిధిలోనే ఉంటుందన్నారు. జిల్లాలో అవసరాలకు అనుగుణంగా ఇసుక లభ్యత ఉండేలా పర్యవేక్షించాలన్నారు. గోదావరి ఉధృతి, ప్రతికూల పరిస్థితుల వల్ల స్టాక్ పాయింట్ల వద్ద నిల్వలకంటే ముందు డీసిల్టేషన్ పాయింట్ల వద్ద ఉన్న నిల్వలను గుర్తించి కేటాయించాలన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక నిల్వలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత నిర్మాణాలకు ఆధార్, ప్లాన్ పంచాయతీ అధికారి ధ్రువీకరణ పత్రాలు అవసరమని తెలిపారు. సబ్-కలెక్టర్, ఆర్డీవోల వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో 360 డిగ్రీ సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ, ఇతర ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన బల్క్ కేటాయింపులకు ఏడు ప్రతిపాదనలొచ్చాయని, వాటికి నిబంధనలు అనుసరించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పీ వి.సోమశేఖర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ జి.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

గత అక్రమాలపై నిలదీస్తున్నామనే ఆరోపణలు

- ఎన్ఎంఈ లూథరన్ చర్చి ఫాదర్ అనిల్‌కుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ అనిల్‌కుమార్

ధవళేశ్వరం, జూలై 16: ధవళేశ్వరంలోని ఎన్ఎంఈ చర్చిలో ఎటువంటి నిధులు దుర్వినియోగం జరగలేదని, గత అక్రమాలపై నిలదీస్తున్నామనే పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఫాదర్ అనిల్‌కుమార్ అన్నారు. చర్చిపై అధికారం కోసం నెల రోజులుగా కొందరు తన విధులకు ఆటంకం కలిగిస్తూ దైవారాధన జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం చర్చి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ జి.కిరణ్‌బాబు, చర్చికి రానటువంటి మరి కొందరితో గందరగోళం సృష్టించి ఆరాధనను అడ్డుకంటున్నారని దీనిపై రెవెన్యూ అధికారులు, పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చారని అయినా వీరి తీరు మారలేదన్నారు. చర్చకు వచ్చే ఆదాయంలో ప్రతి పైసాకు లెక్కలు ఉన్నాయని తేల్చి చెప్పారు. ట్రెజరర్ పి.ప్రవీణ్ మాట్లాడుతూ రూ.80లక్షల చర్చి నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు చేస్తున్న వారు దానిని రుజువు చేస్తే ఏ శిక్షకైనా తాను సిద్ధమని లేకుంటే ఆరోపణలు చేసిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. మరో మూడుసంవత్సరాలు సర్వీసు పూర్తిచేయాల్సిన పాస్టర్ అనీల్‌కిరణ్‌ను సాగనంపడానికి చేస్తున్న కుటిల యత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో అడహక్ కమిటీ సభ్యులు లలితా మోజేస్, కిషోర్, పాల్‌మహేష్, ఆర్.మణికుమారి, ఎ.అరుణ, గంధం రమణ,బూసి రజని పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ అభివృద్ధికి సహకారం

- అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాధుర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16: ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్, అమ లాపురం రీజియన్ల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అమలాపుం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. ఎంపీ అయ్యాక తొలిసారిగా ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్‌ను మంగళవారం సందర్శించారు. ఎంపీకి అసెట్ మేనేజరు శాంతనుదాస్ బృందం ఘనంగా స్వాగతం పలికారు. తొలుత అసెట్‌లో బీఆర్ అంబేద్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటుపై ఆవరణలో మొక్కను నాటారు. కాన్ఫరెన్స్ హాలులో రాజమండ్రి అసెట్ కార్యకలాపాలకు సంబంధించి సంక్షిప్త ప్రదర్శనను ఎంపీ తిలకించారు. భూసేకరణ, పైప్‌లైన్ వేయడం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అసెట్ సీనియర్ అధికారులు, కలెక్టివ్‌లు పాల్గొన్నారు.

రైలుకు ఎదురెళ్లి.. యువకుడి ఆత్మహత్యాయత్నం

నిడదవోలు, జూలై 16: ఒక యువకుడు రైలుకు ఎదురెళ్లి ఆత్మహ త్యాయత్నానికి ప్రయత్నించాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఒక రైలుకు ఎదురెళ్లాడు. ఆ రైలు అతని ఢీకొని వెళ్లిపోవడంతో పక్కకు పడి తీవ్రగాయాలపాలయ్యాడు. 30 ఏళ్లు ఉండవచ్చని తెలిసింది. అత ని వివరాలు తెలియరాలేదు. స్థానికులు గమ నించి వెంటనే 108లో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ మేరకు అక్కడికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

పంటబోదెలో పడి పశువుల కాపరి మృతి



గోపాలపురం, జూలై 16: పంటబోదిలోపడి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని గుడ్డిగూడెంలో జరిగింది. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాడుగుల అశోక్(26) పశువులు మేపుతూ జీవించేవాడని, శుక్రవారం ఉదయం పశువులు తోలుకుని పొలం వెళ్లాడని, రాత్రి పశువులు మకాం వద్దకు వచ్చిన అశోక్ ఇంటికి తిరిగి రాలేదన్నారు. మంగళవారం ఉదయం గుడ్డిగూడెం శివారులో ఉన్న పంట బోదెలో మృతిచెందిన ఉన్నట్టు స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పీఎంపీలకు వ్యాధులపై అవగాహన ఉండాలి

గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ రామ్‌గోపాల్‌తేజ



వైద్య నిపుణులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 16: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించే పీఎంపీలు వ్యాధుల పట్ల అవగాహన కలిగా ఉండాలని ప్రముఖ గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ రామ్‌గోపాల్ తేజ అన్నారు. హుక్కుంపేటలో కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వ హించిన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీర్ణాశయ వ్యాధులకు నేటి ఆహారపు అలవాట్లే కారణం అన్నారు. గైనకాల జిస్ట్ డాక్టర్ బీఎస్.మాణిక్యాంబ(బాల) మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులను ఎలా గుర్తించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి శాఖ అధ్య క్షుడు రహమాన్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కోశాధికారి పి.చిన్ని,మండల కార్యదర్శి మట్టా రమేష్,కోశాధికారి యు.ప్ర సాద్ బాబు, ఏ.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి వినియోగదారుల సమస్యలు



కలెక్టర్ ప్రశాంతిని కలిసి మొక్కను అందిస్తున్న అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16: జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో వినియోగదారుల సమస్యలను విన్నవించారు. జిల్లా వినియోగదారుల రక్షణ చట్టం అమలుకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బలోపేతానికి కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బందికి కనీస వేతనాలివ్వాలి

ప్రైవేట్ హాస్పటల్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పూర్ణిమరాజు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 : ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని ప్రైవేట్ హాస్పటల్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన ది రాజమండ్రి ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సులు, కాంపౌండర్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు కనీస వేతనం ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో ఏడిద నాగేశ్వరరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీను మాట్లాడుతూ యూనియన్ మహాసభ ఆగస్టు 25న జరుగుతుందన్నారు. యూనియన్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక

అధ్యక్షుడిగా అప్పలరాజు



ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16: ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నూతన కార్యవర్గంలో డివిజన్ గౌరవాధ్యక్షుడిగా తుమ్మల తాతారావు, అధ్యక్షుడిగా ఎంసీహెచ్ అప్పలరాజు, డివిజన్ సెక్రటరీగా పిల్లి వైవీ ప్రసాద్, కోశాధికారిగా కుసుమ శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.మాధవరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఐ.దుర్గాప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా పి.నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా బి రత్నరాజు ,ఉపాధ్యక్షుడిగా ఎన్‌వీవీ సత్యనారాయణలను ఎన్నుకున్నారు. కంపెనీ గౌరవాధ్యక్షుడు కాశీ మోహనరావు, కార్యదర్శి వీఎస్ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అంబటి రాజారత్నం, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చిన వెంకట్రావు, టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ ముప్పిడి గణేష్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

జేగురుపాడులో పూడికతీతలు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కూటమి నాయకులు

కడియం, జూలై 16: జేగురుపాడులో డ్రైనేజీలు పూర్తిగా పూడిక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఉన్నతాధికారులకు తెలియపర్చడంతో వారు స్పందించి సిబ్బందితో పూడికతీత పనులు చేపట్టారు. పనులును కూటమి నాయకులు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, వల్లూరి మోహనరావు, కర్రి చినబాబు, సూర్యకుమార్, వనమాలి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కల్కి
వై.స్క్రీన్2	భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి: ప్రభుత్వ జూనియర్ కళాశాల	
అనన్య	భారతీయుడు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	---
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	భారతీయుడు-2

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భారతీయుడు-2
స్క్రీన్ 2	కల్కి
శ్రీనివాస	---